సాక్షి నిర్మల్

సోమవారం । 20 । మార్చి । 2023



అకాల వర్షం.. రైతులకు నష్టం
జిల్లాలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. 9లో▸

వాలుతున్న పొద్దు



'ఆదివారమైనా సెలవులేదు. నీదే వారమంటూ నన్నే రమ్మంటరు. రోజంతా తిరిగి అలసిపోయిన.. ఇగ ఇవ్వాళ్టికి పోయొస్త..' అంటున్నట్లు సూరీడు ఇంటిబాట పట్టాడు. వంపులు తిరిగిన తారురోడ్డు పైనుంచే సూర్యుడు అలా.. పడమటి దిక్కు పోతున్నట్లున్న ఈ చిత్రం నిర్మల్‌రూరల్ మండలంలోని వెంకటాపూర్–అక్కాపూర్ మధ్యలో కనిపించింది. - నిర్మల్

న్యూస్‌రీల్

ఆరుగురిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడ్డ మహిళ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్ కాలనీలో ఆదివారం రాత్రి ఆరుగురిపై కుక్కలు దాడి చేశాయి. వారిలో ఒక బాలుడు, వృద్ధురాలు, నలుగురు మహిళలు ఉన్నారు. కాలనీలో నడుచుకుంటూ వెళ్తుండగా రోడ్డు పక్కనే ఉన్న కుక్కలు ఒక్కసారిగా వారిపై దాడి చేసి గాయపర్చాయి. గమనించిన స్థానికులు కుక్కలను దూరంగా తరిమేశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంబి(ఖానాపూర్): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునకారి రాజేశ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదన్నారు. తరాలు మారిన కార్మికుల తలరాతలు మారడంలేదన్నారు. మహాసభలో కార్మికుల హక్కుల కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, నాయకులు విజయ్, రాజుబాయి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

23న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఈ నెల 23న గురువారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాట్లను ఆదివారం జిల్లా నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లా వెంకట్రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్, జెడ్పీటీసీ చిన్న రామయ్య, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ గోపిడి గంగారెడ్డి, మంత్రి పీఏ నాలం శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ ఫసి, నాయకులు అయిటి మహేష్, బర్కుంట గంగారాం, బర్కుంట రమేశ్, సాగర్, మజర్, తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జిల్లా కార్యవర్గం

లక్ష్మణచాంద(నిర్మల్): జిమ్నాస్టిక్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా వి.శ్రీనివాస్‌రెడ్డి (బొప్పారం), కార్యదర్శిగా సీహెచ్ రాజేందర్ (లక్ష్మణచాంద), కోశాధికారిగా నవీన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయపాల్‌రెడ్డి, కార్యదర్శి పార్థసారథిరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి, అబ్జర్వర్ దయానంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పేపర్ లీకేజీ'పై నేడు బీజేపీ ధర్నా

నిర్మల్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీ ఘటనకు సంబంధించిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఈ కేసును సిట్టింగ్ జడ్జితో విచారించాలని, చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని పార్టీ నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ నాయిడి మురళీధర్ పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు సోమవారం నియోజకవర్గ కేంద్రాలలో ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్లోగా వసూల్!



- పన్నుల వసూలులో రాష్ట్రంలోనే చివరిస్థానంలో భైంసా మున్సిపాలిటీ
- 22.71 శాతం మాత్రమే వసూలు
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా లక్ష్యం చేరని వైనం
- దృష్టి సారిస్తే చేరుకోవడం సాధ్యమే

భైంసాటౌన్(ముధోల్): ఏటా ఆస్తిపన్ను వసూలుతో పాటు స్వచ్ఛభారత్ వంటి పథకాల అమలులో ముందుంటూ పలుమార్లు ఉత్తమ పురస్కారాలు పొందిన భైంసా మున్సిపాలిటీ ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలులో నెమ్మదించింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పన్నుల వసూలుపై అధికారిక గణాంకాల్లో భైంసా మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరిదశకు వచ్చినా ఇప్పటివరకు లక్ష్యంలో 25 శాతానికి కూడా చేరుకోలేదు.

22.71 శాతమే వసూలు

భైంసా మున్సిపాలిటీలోని 26 వార్డుల పరిధిలో 60 వేల వరకు జనాభా నివాసం ఉంటున్నారు. బల్దియాకు ఆస్తిపన్ను రూపంలో ఏటా రూ.2కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.205.25 లక్షల ఆస్తి పన్ను బకాయిలతో పాటు రూ.18.13 లక్షల అపరాధ రుసుం, రూ.186.73 లక్షల పాత బకాయిలు, వాటిపై రూ.197.31 లక్షల అపరాధ రుసుం కలిపి మొత్తం రూ.607.42 లక్షల వరకు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. కాగా ఈనెల 18వ తేదీ నాటికి 137.93 లక్షలు మాత్రమే వసూలైంది. అంటే లక్ష్యంలో 22.71 శాతమే చేరుకుంది. గతంలో పన్నుల వసూలులో 90 శాతానికి మించి పన్నులు వసూలు కాగా నాలుగేళ్లుగా పన్నుల వసూలులో భైంసా మున్సిపాలిటీ వెనుకబడింది. దీనికితోడు ప్రభుత్వం గతంలో ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశం కల్పించింది. కాగా ఈ అవకాశాన్ని చాలామంది పట్టణవాసులు వినియోగించుకోలేదు. దీంతో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా రాష్ట్రంలోనే భైంసా మున్సిపాలిటీ చివరిస్థానంలో నిలిచింది.

భైంసాలో ఇలా...

వార్డులు : 26, జనాభా : 60వేలు
అసెస్‌మెంట్లు : 11,900
2022-23 ఆర్థిక సంవత్సరం బకాయిలు : రూ.205.25 లక్షలు
అపరాధ రుసుం : రూ.18.13 లక్షలు
పాత బకాయిలు : రూ.186.73 లక్షలు
అపరాధ రుసుం : రూ.197.31 లక్షలు
మొత్తం డిమాండ్ : రూ.607.42 లక్షలు
ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు : రూ.59.35 లక్షలు

ఆదాయం పెంపుపై దృష్టి పెడితేనే...

భైంసా బల్దియాలో ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంటోంది. ఉద్యోగుల జీతభత్యాలు, చెత్త వాహనాల డీజిల్ ఖర్చు, నిర్వహణ ఖర్చు, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్‌బిల్లులు.. ఇలా ఆదాయానికి మించి ఖర్చు ఎక్కువగా ఉంది. ఇటీవల మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో సైతం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఇదే విషయం ప్రస్తావించారు. మున్సిపాలిటీకి సొంతంగా ఆదాయ వనరులు పెంచుకోవాలని, తద్వారా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సూచించారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సులు పెంచడం ద్వారా ఆదాయమార్గాలు పెంచుకోవచ్చన్నారు. పట్టణం నానాటికీ విస్తరిస్తున్న నేపథ్యంలో ఖర్చులకు తగినట్లుగా ఆదాయం పెంచుకోకతప్పదని సమావేశంలో సూచించారు. భవన నిర్మాణాలకు అనుమతులు, ఖాళీ స్థలాలపై పూర్తిస్థాయి పన్ను వసూలు చేయడం ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో ఆస్తిపన్నుతో పాటు ఇతర పన్నులు సకాలంలో వసూలు చేసి భైంసా మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత మున్సిపల్ పాలకవర్గం, అధికారులపై ఉంది.

వసూళ్లు వేగవంతం చేశాం

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఆరు బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూళ్లు వేగవంతం చేశాం. రూ.50 వేలకు పైబడి బకాయి ఉన్నవారికి రెడ్‌నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.
– వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్, భైంసా

సెర్ప్ ఉద్యోగులకు ఉగాది కానుక

- అమలులోకి పేస్కేల్
- జీవో 11 విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 117 మంది ఉద్యోగులకు మేలు
- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వేతనాలు
- ఏప్రిల్ 1 నుంచి అమలు



నిరాహారదీక్ష చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: డీఆర్‌డీవోలో 21 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో నామమాత్రపు ఉద్యోగ భద్రతతో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది కానుకగా తీపి కబురు చెప్పారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గతేడాది మార్చి 15న అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేస్తూ శనివారం జీవో 11 విడుదల చేశారు.

ఏప్రిల్ నుంచి అమలు

జిల్లాలోని 117 మంది సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ అమలుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కనిష్ట పే స్కేల్ రూ.19 వేల నుంచి రూ.58,850 కాగా, గరిష్ట పే స్కేల్ రూ.51,320 నుంచి రూ.1,27,310లుగా నిర్ణయించింది. పెంచిన వేతనాలు ఏప్రిల్‌లోనే ఉద్యోగులకు అందనున్నాయి.

2002లో నియామకం

కేంద్ర ప్రభుత్వ పథకమైన డీఆర్‌డీఓలో సెర్ప్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అందులో పనిచేసేందుకు 2002, 2003లో హెచ్‌ఆర్ పాలసీ కింద ఉద్యోగులను భర్తీ చేసింది. అన్ని శాఖల్లో ఏడాదికోసారి కాంట్రాక్టు ఉద్యోగులను రెన్యూవల్ చేస్తుండగా ఈ శాఖలో మాత్రం ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటి వరకు వారికి ఎలాంటి క్యాడర్, పేస్కేల్ అమలు చేయలేదు. కాంట్రాక్టు పద్ధతిన కొంత వేతనం ఇస్తూ వస్తున్నారు.

డీపీఎంల అసంతృప్తి

సెర్ప్ ఉద్యోగుల క్యాడర్ వర్తింపు విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుతం పని చేస్తున్న డీపీఎంలు అసంతృప్తితో ఉన్నారు.

117 మంది ఉద్యోగులకు మేలు

జిల్లాలో 117 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకు పే స్కేల్ లేకపోవడంతో పాటు ఏ క్యాడర్లో పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం క్యాడర్ ఫిక్స్ కావడం వల్ల వారికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే పేస్కేల్ వర్తించడంతో పాటు వేతనాలు కూడా పొందనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సెర్ప్ ఉద్యోగులకు మేలు జరుగనుంది.

జిల్లా వివరాలు

హోదా	ఉద్యోగుల సంఖ్య
అడిషనల్ డీఆర్డీవో	1
జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు	5
అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు	22
కమ్యూనిటీ కోఆర్డినేటర్(లెవల్–1)	12
కమ్యూనిటీ కోఆర్డినేటర్(లెవల్–2)	55
మినిస్టీరియల్ అండ్ సపోర్టింగ్ స్టాఫ్	10
మండల సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లు	12

ఎవరెవరికి ఎంత జీతం పెరిగిందంటే..

- మండల సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు రూ.19వేల నుంచి రూ.58,850
- మండల బుక్ కీపర్లకు రూ.22,240 నుంచి రూ.67,300
- డ్రైవర్లకు రూ.22,900 నుంచి రూ.69,150
- ఆఫీస్ సబార్డినేట్లకు రూ.19 వేల నుంచి రూ.58,850
- కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు రూ.24,280 నుంచి రూ.72,850
- అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు రూ.32,810 నుంచి రూ.96,890
- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లకు రూ.42,300 నుంచి 1,15,270
- ప్రాజెక్ట్ మేనేజర్లకు రూ.51,230 నుంచి రూ.1,27,310
- అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రాజెక్టు సెక్రటరీస్‌కు రూ.24,280 నుంచి రూ.72,850

ప్రభుత్వానికి ధన్యవాదాలు



సెర్ప్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పేస్కేల్ ప్రకటించడం హర్షణీయం. పేస్కేల్ అమలు చేయడంతో తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇన్నాళ్లు పడిన శ్రమకు తగిన ఫలితం దక్కింది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– జ్యోతిర్మయి, మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్, నిర్మల్

ప్రజల్లోకి పార్టీలు..

- ఎన్నికల ముందు నాయకుల ప్రజాబాట
- ఒక్కోపేరుతో వెళ్తున్న జెండాలు
- కార్నర్ మీటింగ్‌లు పెట్టిన బీజేపీ
- 'యాత్ర'ను మధ్యలోనే ఆపిన కాంగ్రెస్
- తాజాగా బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు



నిర్మల్: ఏ పేరైనా సరే.. ప్రస్తుతం ప్రజల్లోకి పోవడమే ప్రధాన పార్టీల ముందున్న లక్ష్యం. ఇప్పటికే పలు యాత్రలు, కార్నర్ మీటింగ్‌ల పేరిట బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజల వద్దకు వెళ్లాయి. తాజాగా బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాల పేరిట జనం బాట పట్టనుంది. పార్టీ కార్యక్రమాలతో పాటు తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం పెట్టుకుంది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజల్లోకి వెళ్తుండటంతో పోటీగా బీఆర్‌ఎస్ సమ్మేళనాలను ఎంచుకుంది. ఈ ఏడాదిలోనే ఎన్నికలు ఉండటం, రాష్ట్రంలో రోజురోజుకూ మలుపులు తిరుగుతున్న రాజకీయం నేపథ్యంలో మూడు ప్రధాన పార్టీలు ఎంత వీలైతే అంత ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.

'కమలం' కార్నర్ మీటింగ్..

రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్రతో జిల్లాలో వచ్చిన జోష్‌ను కాపాడుకునేందుకు బీజేపీ వివిధ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. అందులో భాగంగానే ఇటీవల వరకు కార్నర్‌మీటింగ్‌లను ఎంచుకుంది. క్షేత్రస్థాయి వరకూ పార్టీని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో శక్తికేంద్రాల(పోలింగ్‌బూత్) వారీగా సమావేశాలను నిర్వహించింది. కేంద్రం చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూనే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనను ఎండగట్టింది.

ఆగిన 'హస్తం' యాత్ర..

జిల్లాలో ఘనమైన చరిత్ర ఉన్న కాంగ్రెస్ తిరిగి పూర్వవైభవం కోసం ప్రయత్నం చేస్తోంది. తన వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు పార్టీని పైకి తీసుకొచ్చేందుకు ఇటీవల ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి ప్రయత్నం చేశారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భైంసా నుంచి తెలంగాణ పోరుయాత్రను అట్టహాసంగా ప్రారంభించారు. భైంసాలో పెద్దగా స్పందన రాకున్నా.. నిర్మల్, లక్ష్మణచాంద, మామడ సభలు ఫర్వాలేదనిపించాయి. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే స్వయంగా నిర్మల్ సభలో పాల్గొన్నారు. అంతలోనే ఆ యాత్రకు బ్రేక్ వేశారు. తన పోరుయాత్రను ఠాక్రేనే ఆపివేయాలన్నారని మహేశ్వర్‌రెడ్డి పేర్కొనడం పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పార్టీని నాయకులు తమ తీరుతో వెనక్కు తీసుకెళ్తున్నారని కార్యకర్తలు వాపోతున్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం..

ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌ల ఎదురుదాడులు, దానికి తగ్గట్లు వరుసగా లిక్కర్‌స్కామ్, పేపర్‌లీకేజీ తదితర ఘటనలు వచ్చిపడుతుండటంతో 'కారు' కాస్త ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇలాంటి తరుణంలో పార్టీ కార్యకర్తలకు భరోసానివ్వడంతో పాటు ప్రజల నమ్మకం పొందేలా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 23 నుంచి వచ్చేనెల 22 వరకు ఆత్మీయ సమ్మేళనాలకు ప్లాన్‌చేశారు. ఈనెల 23న నర్సాపూర్(జి) మండల కేంద్రంలో తొలి సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొననున్నారు. పెద్ద మండలాల్లో ఒకటి నుంచి మూడువరకు చిన్నమండలాల్లో కనీసం ఒక సమ్మేళనం చొప్పున నిర్వహించేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే జిల్లాతో పాటు ఆదిలాబాద్‌కు కలిపి ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

పథకాలను వివరిస్తాం

జిల్లాలో ఈనెల 23నుంచి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించనున్నాం. ఇందులో భాగంగా ప్రజలకు పార్టీ ఎజెండాను, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తాం. క్యాడర్‌లోనూ భరోసా నింపేలా సమ్మేళనాలను విజయవంతం చేస్తాం.
– జి.విఠల్‌రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లాఅధ్యక్షుడు

23 నుంచి సీపీఎం జనచైతన్య యాత్ర

నిర్మల్‌టౌన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 23 నుంచి 29 వరకు నిర్వహించనున్న సీపీఎం జనచైతన్య యాత్రలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేటు విధానాలను వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, శంభూ, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల(ముధోల్): భక్తుల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు స్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. గజ్జలమ్మ వెండి తొడుగు ముఖద్వారం కోసం భక్తులు సుమారు 50 తులాల వెండిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

- నువ్వు సాగుపై జిల్లా రైతుల ఆసక్తి
- పసుపు తవ్విన వెంటనే విత్తుకోవాలంటున్న వ్యవసాయాధికారులు
- ఇప్పటికే 25 వేల ఎకరాల్లో సాగు..

లోకేశ్వరం/లక్ష్మణచాంద: యాసంగిలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. యాసంగి నువ్వు పంట సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని పేర్కొంటున్నారు. యాసంగిలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు పంట పూతదశకు చేరుకుంటే దిగుబడి తగ్గుతుందని, ప్రస్తుతం నువ్వు విత్తుకునేందుకు అనుకూల పరిస్థితి ఉందంటున్నారు. యలమంచిలి, రాజేశ్వరి, శ్వేతి తిల్, చందన, హిమ రకాలు అనుకూలంగా ఉంటాయన్నారు. నువ్వుపంటలో తక్కువనీరు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని, పసుపు పంటను తవ్విన నేలల్లో సాగుచేస్తే లాభసాటిగా ఉంటుందని సూచిస్తున్నారు.

25 వేల ఎకరాల్లో సాగు..


సంప్రదాయ పద్ధతుల్లో ఎప్పుడూ ఒకేరకమైన పంటలు సాగుచేసి నష్టపోకుండా తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల సాగుకు జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్వల్పపెట్టుబడి, అతితక్కువ శ్రమతో అధిక లాభాలు సాధించే పంటల్లో నువ్వు ఒకటి. ఇప్పటికే 25 వేల ఎకరాల్లో సాగు చేశారు. మరో 5 వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

బొంత పురుగు ఆశించే అవకాశం..

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో నువ్వు పంటను బొంత పురుగు ఆశించే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పొద్దంతా నేలలో ఉండే పురుగులు రాత్రి పంటలపై దాడి చేస్తాయని పేర్కొంటున్నారు. నివారణకు నోవాల్యూరాన్ 1 ఎంఎల్‌ను లీటర్ నీటికి కలిపి సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేయాలని సూచిస్తున్నారు.

నీటి యాజమాన్యం..

విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వడం వల్ల మొలక బాగా వస్తుంది. తర్వాత సున్నిత దశలైన పూత, కాయ దశల్లో నీరు అవసరం అధికంగా ఉంటుంది. విత్తిన 30–40 రోజుల వరకు పంట పూతకు వస్తుంది. కాయలు గింజలు గట్టి పడటానికి 70 రోజుల సమయం పడుతుంది. మధ్యకాలంలో నేలలో తగినంత తేమ ఉంటే దిగుబడి బాగుంటుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.




లోకేశ్వరంలో సాగు చేసిన నువ్వు పంట

ఆశాజనకంగా పంట..

జిల్లాలో సాగవుతున్న నువ్వు పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. జిల్లాలో అధిక దిగుబడి వచ్చే జేసీఎస్ 1020 రకం ఎక్కువ సాగుచేశారని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ రకం ఎకరానికి 5–6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంటున్నారు. రైతులు గతంలో సాగుచేసే శ్వేత రకం ఎకరానికి కేవలం 2–3 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, జేసీఎల్ 1020 రకం దానికి రెండింతల దిగుబడి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఎకరాకు రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



జిల్లాలో ఈ యాసంగిలో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో నువ్వు పంట విత్తారు. ప్రస్తుతం పంట బాగానే ఉంది. వాతావరణంలో మార్పులు వస్తుండటంతో బొంత పురుగు వచ్చే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి. యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి సాధించవచ్చు. - అంజిప్రసాద్, డీఏవో

క్లుప్తంగా

గేట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్

భైంసా(ముధోల్): గేట్–2023 ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చైతన్య 293వ ర్యాంకు, మణిప్రసాద్ 912వ ర్యాంకు, జగదీశ్ 234వ ర్యాంకు, శివకుమార్ 563వ ర్యాంకు సాధించారు. ఆదివారం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ శాఖాధిపతి కార్తీక్, అధ్యాపకులు ధీరజ్, ప్రణయ, తేజస్విని, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాహితి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహితి ముధుల్కర్ ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. గత విద్యా సంవత్సరం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లలో అత్యధిక మార్కులు సాధించింది. యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ గోల్డ్ మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. సదరు విద్యార్థినిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీజీ రెడ్డి, అధ్యాకులు రవికుమార్, శ్రీహరి, నర్సయ్య అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అదిలాబాద్ రూరల్: మండలంలోని అర్లి(బి) శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. అర్లి(బి) గ్రామానికి చెందిన నలుగురు, అడ, కంట గ్రామానికి చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వారివద్ద నుంచి రూ. 19,360 నగదు, 5 ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టవేరా చోరీ

జైనథ్: మండల కేంద్రానికి చెందిన ఉల్లాస్‌కు టవేరా వాహనం చోరీకి గురైంది. బాధితుడు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లాస్ ఈనెల 16న రాత్రి ఇంటి ఎదుట టవేరా వాహనం నిలిపాడు. ఉదయం లేచి చూడగానే కనిపించ లేదు. రెండు రోజుల పాటు వాహనం కోసం గాలించాడు. అచూకీ దొరకకపోవడంతో చోరీకి గురైంది భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పడిపోతున్నా పట్టించుకోరా?



కలెక్టరేట్ ఎదుట ఒక వైపునకు పడిపోయిన ట్రాఫిక్ సిగ్నల్

జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కలెక్టరేట్ ముందున్న సిగ్నల్ కిందకు వంగి ఉంది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. ఈద్గం వద్ద ఉన్న సిగ్నల్స్ ఏడాదిగా పనిచేయడంలేదు. మంత్రి నివాసం వద్ద ఉన్న సిగ్నల్స్ కిందపడి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మంత్రి నివాసం వద్ద కిందపడిపోయిన ట్రాఫిక్ సిగ్నల్



ఈద్గామ్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఏకరూపం.. ఆకర్షణీయం

- స్కూల్ యూనిఫాం డిజైన్ మార్చిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లోనే కుట్టించేలా చర్యలు
- పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందుబాటులోకి..

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలను మార్చుతున్న ప్రభుత్వం ..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాం 2023–24 సంవత్సరానికి గాను జాప్యం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లెక్కలు తీసి అవసరమైన ముడి వస్త్రం ఆర్డర్ ఇచ్చింది. ఈ నెలాఖరు వరకు జిల్లాలకు నూతన ముడి వస్త్రం వచ్చేలా చర్యలు చేపడుతోంది. గతేడాది యూనిఫాం పంపిణీలో జాప్యం కారణంగా పంద్రాగస్టుకు కూడా పాత దుస్తులే ధరించాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల ప్రారంభం నుంచే యూనిఫాం అందించేలా ప్రణాళికలు రూపొందించింది. ముడి వస్త్రం జిల్లాకు చేరగానే సెలవుల్లోనే దర్జీ వద్దకు చేర్చి అక్కడి నుంచి పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాలని సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3, 481 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,18,853 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండు జతల యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ముడివస్త్రం టెస్కో నుంచి 10,80,447 మీటర్లు ఉమ్మడి జిల్లాకు సరఫరా చేయనుంది. మొదట నేరుగా ఎమ్మార్సీలకు అక్కడి నుంచి పాఠశాల స్థాయికి చేర్చనున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎంలకే దుస్తులు కుట్టించే బాధ్యతలు అప్పగించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టించే బాధ్యతను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించారు. ఏమాత్రం జాప్యం జరుగకుండా వేసవి సెలవులు ముగిసే నాటికి యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారు.



మార్చిన డిజైన్లు ఇవే(ఫైల్)

సరికొత్తగా యూనిఫాం..

వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం సరికొత్తగా డిజైన్ చేశారు. రంగు మార్చకుండా డిజైన్ మాత్రమే మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విధి విధానాలు రూపొందించారు. 1 నుంచి 3వ తరగతి బాలికలకు బాడీఫ్రాక్‌లు, రైట్‌సైడ్ లోపలికి ఒకపాకెట్, ఎదురు కుచ్చిళ్లు, 2 ఇంచులు పట్టితో కుట్టనున్నారు. బాడీ ఫ్రాక్‌కు కింద షర్టుక్లాత్‌తో 2 ఇంచులు వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు సూటింగ్ క్లాత్‌తో కుట్టనున్నారు. షర్టుకు చేతులకు పట్టీలు, క్లిప్‌లు, షూటింగ్ క్లాత్‌తో వేయాల్సి ఉంది. క్లిప్ పొడవు 3 ఇంచులు, వెడల్పు ఇంచుతో యూనిఫాం డిజైన్ రూపొందించారు. ఇక 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు కుట్టడం, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, బుజాలపైన క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులు(హ్యాండ్ లూప్స్) తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్ డిజైన్ చేశారు. టాప్, రెండు చేతులకు క్లిప్‌లు, ముందు భాగాన యు ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేశారు. 1 నుంచి 12వ తరగతి వరకు బాలురుకు షర్టుకు రెండు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు గుండీతో పెట్టి కుట్టాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాం అందించేందుకు చర్యలు చేపట్టాం. యూనిఫాంల డిజైన్ మార్చుతూ విధివిధానాలు ఖరారయ్యాయి. ఈనెలాఖారు వరకు జిల్లాకు టెస్కో ద్వారా ముడి వస్త్రం ఎమ్మార్సీలకు చేరుతుంది. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తాం. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే దుస్తులు అందిస్తాం.
– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

జిల్లాల వారీగా పాఠశాలలు, విద్యార్థులు అవసరమయ్యే వస్త్రం వివరాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	కావాల్సిన వస్త్రం(మీటర్లలో)
మంచిర్యాల	805	45,309	2,32,750
ఆదిలాబాద్	1,194	73,582	3,40,567
నిర్మల్	735	54,227	2,67,055
ఆసిఫాబాద్	747	46,735	2,40,075

దాతలు సాయం అందించరూ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన పాలాస రవి(40) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈనెల 5న హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేరిన రవికి ఈనెల 10న వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం రూ.రెండు లక్షల వరకు మందుల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కాగా తమకు మందులు కొనే స్థోమత లేదని దాతలు స్పందించి సాయం అందించాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. కాగా బాధితుడి తల్లి లలిత సైతం 20 రోజుల కిందట గొంతు క్యాన్సర్‌తో మృతి చెందింది. తల్లికి చికిత్స అందించేందుకు కొద్ది నెలల కిందట చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం మందులు కొనేంత శక్తి లేదని బాధిత కుటుంబీకులు వాపోయారు. బాధితుడు రవి భార్య చేతన మానసిక పరిస్థితి సైతం బాగా లేదు. వీరికి పదేళ్లలోపు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రస్తుతం తండ్రి రాజన్న అన్ని తానై కొడుకుకు సేవలు చేస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన ఫోన్ పే నంబర్: 9959847511



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రవి

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి
- మెనూ పాటించడం లేదని పీవోకు ఫిర్యాదు
- వార్డెన్‌ను తొలగించాలని ఆర్‌సీవోకు ఆదేశాలు

నార్నూర్: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వరుణ్‌డ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ.. 15 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలవడంతో ఆదివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రిమ్స్ వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఘటన గురించి ఆరా తీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను వెంటనే తొలగించాలని ఆర్‌సీవోను ఆదేశించారు. బయటకు వచ్చిన పీవోకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా విద్యార్థులకు గుడ్లు, పల్లిపట్టీలు ఇవ్వడం లేదన్నారు. మెనూ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీవో మాట్లాడుతూ.. విద్యార్థులు మినరల్ నీరు తాగడంతో పాటు రక్తహీనత, న్యూట్రీషన్, కాల్షియం తక్కువగా ఉండడంతో శ్వాససమస్యతో బాధపడుతున్నారని తెలి పారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

చెరువులో పడి వీఆర్‌ఏ మృతి



శ్రీనివాస్(ఫైల్)

నిర్మల్‌టౌన్: నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పని చేస్తున్న స్థానిక గొల్లపేట్‌కు చెందిన సిద్ధ శ్రీనివాస్(45).. ఆదివారం ఉదయం నిర్మల్ ధర్మసాగర్ చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. దీంతో తహసీల్దార్ సుభాశ్ చందర్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.10వేలను ప్రశాంత్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వీఆర్‌ఏ సిద్ధ శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాదేమియా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం?

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు సురేందర్ ఆదివారం స్థానిక గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. భూవివాదంలో తనకు న్యాయం చేయాలంటూ ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన గోదావరి వద్దకు వెళ్లి జాలర్ల సాయంతో బాధితుడిని కాపాడినట్లు తెలిసింది.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



గడేకర్ గణపత్(ఫైల్)

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రి గ్రామానికి చెందిన గడేకర్ గణపత్(60) శనివారం రాత్రి ఆటోలో భైంసాలోని బంధువుల ఇంటికి వస్తుండగా భైంసాలోని సాత్‌పూల్ వద్ద ఆటో బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన జెడ్ల నడిపి పోతన్న ఆదివారం ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. పోతన్నబావమరిది పెద్ద లస్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ దేవేందర్‌గౌడ్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

నార్నూర్: మండలంలోని పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ప్రేంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా లింగాపూర మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన సోయం శ్రీనివాస్ (28) బైక్‌పై నార్నూర్ మండలంలోని పూసిగూడ గ్రామంలో తన బంధువు పెళ్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పింది. బైక్ అతడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి తమ్ముడు సోయం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమ్మేళనం పేరుతో సొమ్ములు స్వాహా

- పూర్వ విద్యార్థుల ఆవేదన
- నిర్వాహకులపై మండిపాటు
- పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్: పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పేరుతో లక్షల్లో డబ్బులు వసూలు చేసి తప్పుడు లెక్కలు చూపి, తమ సొమ్ములు స్వాహా చేశారని సింగరేణి కాలరీస్ హైస్కూల్ అలుమిని అసోసియేషన్ నాయకులు తెలిపారు. సీసీసీలోని సింగరేణి స్కూల్ వద్ద ఆదివారం అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షులు పీ.రాజబాబు రెడ్డి, పప్పు శ్రీని వాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఇక్కడ పాఠశాల వద్ద 1986–2022ల టెన్త్ బ్యాచ్‌లతో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. తమతో పాటు చదువుకున్న ఒకరు ఈ కార్యక్రమం చేద్దామని ముందుగా ప్రతిపాదన పెట్టి నమ్మించడంతో, కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అతడి చేతుల్లో పెట్టినట్లు తెలిపారు. అతడు మరో ముగ్గురుని కలుపుకొని సంయుక్తంగా ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి డబ్బులు అందులో జమ చేసుకున్నారన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా కొంత బ్యాంక్ అకౌంట్‌కు, మరికొంత నగదు రూపంలో విరాళాలు ఇచ్చారు. ఇలా మొత్తం సుమారు రూ.40లక్షల వరకు జమ అయ్యాయన్నారు. ఇంత పెద్దయెత్తున డబ్బులు వసూలు చేసిన కూడా కార్యక్రమానికి హాజరైన వారికి సరైన తిండిపెట్టలేదని, ఒంటెద్దు పోకడలతో అందరిని కలుపుకోకుండా కార్యక్రమం చేయడం వల్ల పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. చివరికి తప్పుడు లెక్కలు చూపి ఫండ్‌ను దిగమింగారని ఆరోపించారు. కార్యక్రమానికి ఎంత ఖర్చు అయ్యిందో చెప్పమంటే సరైన లెక్కలు చూపకుండా అడిగితే బెదిరిస్తున్నారన్నారు. తప్పుడు లెక్కలతో కొన్ని లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. స్కూల్ పేరుతో ట్రస్ట్ ఓపెన్ చేసి తాము చదువుకు, పాఠశాలకు ఏదైనా చేయుతనందిస్తారనుకుంటే మొత్తం డబ్బులను స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



20 ఏళ్లకు..

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా 20 ఏళ్ల కిందటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యా,బుద్ధులు నేర్పించిన ప్రధానోపాధ్యాయుడు దేవన్న, ఉపాధ్యాయులు హన్మత్‌రెడ్డి, భూమేశ్, గజేందర్, ఇస్రాహైమద్, నారాయణ, రుక్మారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నవీన్, సాయి, భోజన్న ఉన్నారు.

26 ఏళ్లకు..

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఎల్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE

For Sale Single bit prime Land of 163 Acres. Clear title. Near Highway. road-front. Excellent environment for living, business and agriculture. Red soil with high iron content. Nawabpet (V),Chityala(M),Jayashankar Bhupal pally (D). Contact: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26338]

SERVICES
BUSINESS OFFER

Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720. [T-1196145]

WANTED

అర్జెంట్‌గా ఖమ్మం దగ్గర సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 16,000/- రూమ్ ఫ్రీ, భోజనం అతి తక్కువ రేటు. సంప్ర॥ ఆదిలాబాద్ : 9553008933, 9371264135 [Y-784356]

FACULTY TEACHERS

Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-1010]

హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:16K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899. [H-786849]

Hydలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్ సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీతం: 15,000-30,000. Ph: 9121989324 [HA-10374]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,